# అనగనగా ఒక పేదబడి కథ.



పెద్దింటి అశోక్‌కుమార్

కథ

అందరు నోరు తెరిచిండ్రు. 'ఎంతపనైపాయె. కొండెనాలికకు మందేత్తే ఉన్న నాలిక ఊడిపాయె' అనుకుని చేతులు పిసుక్కున్నరు. 'లక్షలపైస రాల్లపాలాయె' అని బాధపడ్డరు. పైగా ఈ సంగతి జనాలకు తెలవద్దా యె. తెలిస్తే బడికి పిల్లలను పంపరాయె... ఎట్లా...?

టీవీ ఆన్ చేసిన్నోలేదో.... పొద్దుగల్ల పొద్దుగల్లనే పిడుగులాంటి వార్త. ఒక్కసారి షాకు తిన్న. కండ్లు టీవీకే అతుక్కపోయినయి. స్క్రోలింగ్‌లో ఆ వార్త తిరుగుతనే ఉంది. ఒకటికి రెండుసార్లు గట్టిగా చదివి చూసిన. నేను చూసిన వార్త నిజమే!

ఆగమాగాన సెల్ అందుకున్న. మా ప్రాజెక్టు డైరెక్టరుకు ఫోన్ గొట్టిన. బాపు బాత్‌రూంలో ఉన్నడట. మాట్లాడిండు. ఈ ముచ్చట రాత్రే తెలిసిందట.

రాత్రంతా మీటింగులేనట. సెకరెట్రీ, ప్రిన్సిపల్ సెకరెట్రీ, మినిష్టరు, పెద్ద తలుకాయలన్నీ వచ్చినయట. తలుకాయలు పట్టుకున్నయట. బరువును డైరెక్టరు నెత్తిమీద పెట్టినయట.

"రాజూ.....ఆ సీక్రెట్ ఏమిటో కనుక్కో. అదే పాలసీని రాష్ట్రమంతా అమలుచేద్దాం" సారు అన్నడు.

నేను 'సరే' అనక తప్పలేదు. 'పొద్దుగల్ల పొద్దుగల్ల ఎందుకన్నా ఫోన్ జేత్తిరా దేవుడా' అనుకున్న. గాలికి పోయే కంపను తలుగవెట్టుకున్నట్టాయె. నోరు జారినంక తప్పదుగదా, నేను వెంటనే బయలుదేరిన.

ఇంతకీ ఆ పిడుగులాంటి వార్త ఏమిటో చెప్పాలెగదా! ఆ వార్త చెప్పే ముందు రాజు ఉరఫ్ రాజేందర్‌సింగ్ అనబడే నేను ఎవరినో చెబుత. అప్పుడుగాని ఆ వార్తకు నాకు సంబందమేమిటో అది నాకు పిడుగులాంటి వార్త ఎందుకయిందో తెలువది.

** ** **

ఇరువై ఏండ్ల కింద నేను ప్రైమరీ టీచర్ని. అప్పుడు సదువు అదో రకంగా ఉంటుండె. నాదిర్‌సాబ్ వచ్చిండంటే గజ్జుమందురు. పిల్లగాండ్లకు ఇరువై ఎక్కాలు కిందినుంచి మీదికి మీదినుంచి కిందికి బట్టీ పెట్టిద్దును. గుణితాలు, ఒంట్లు, ఓనమాలు అన్నీ బట్టీ పెడుదురు పిల్లగాండ్లు. ఏ బల్లె చూసినా ఇదే కథ.

సార్లను చూసినా చప్రాసీని చూసినా పిల్లలకు పంచితం రాలుతుండె. ఇంట్లో పిల్లలు అల్లరి జేసినా మంకువెట్టినా 'అగో...దయ్యమత్తుంది' అని భయపెట్టినట్టు అగో సారత్తండు' అని తల్లులు భయపెడుదురు. పిల్లలు కుక్కిన పేనులైదురు.

బడిపిల్లలు సార్లంటే భయపడుతున్నరని, ఒక్క టెక్స్టు బుక్కులే సదువుతున్నరని, వాళ్లకు బట్టీ తెలివి తప్ప పని నైపుణ్యం లేదని గవుర్నమెంటు గుర్తించింది. చదువు ఇట్లనే సాగితే క్రియేటివిటీ దెబ్బతిని శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు తయార కాలేరనుకుంది. సదువు చెప్పే పద్ధతిని మార్చి 'కృత్యాధార బోధన', పనితో చదువును చెప్పాలనుకుంది.

రాజు తలుచుకున్నడు. దెబ్బలకు కొదువలేదు. గవుర్నమెంటు తలుచుకున్నది. అప్పులు పుట్టినయి. ఆంధ్రప్రదేశ్ ఫ్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (అపెప్)ను అమలులో పెట్టింది.

నాలుగైదు బళ్లను ఒక సంటరు చేసింది. సంటరుకొక సారును సెకరెట్రీని చేసింది. సెకరెట్రీలందరికి ట్రేనింగులిచ్చింది. వాళ్లు వచ్చి సంటరులోని సార్లందరికి ట్రెనింగ్ ఇయ్యాలె.

మా సంటర్ల నేనే సెకరెట్రీని. ట్రేనింగులిచ్చి సార్ల శిలము దులిపిన. బట్టీపద్ధతి బందువెట్టిన. ఆటపాటలతో చదువు చెప్పాలన్న. చార్టులు బొమ్మలు గీయించిన. సీసలతో లబ్బర్లతో బొమ్మలు తయారుచేయించిన. మాడల్ పాఠాలు చెప్పిన. 'పిల్లలకు పని అనుభవం' ఎట్ల నేర్పాలో చెప్పిన.

అంతటా మీటింగులు బాగానే జరిగినయి. సార్లు బాగనే నేర్చుకున్నరు. ఈ కొత్త పద్ధతిల సదువు బాగా వస్తదన్నరు. బట్టీపెట్టే పాతపద్ధతి బాగలేదన్నరు. పిల్లలతో కుండలు గురుగులు చేయిస్తమన్నరు. సదువుతో పనికంటే పనితో సదువే మంచిదన్నరు.

ఐదేండ్ల పొద్దుగడిచింది. గవుర్నమెంటు అప్పుదెచ్చిన కుప్ప అయిపోయింది. మంచి సదువు వచ్చిందనుకుంది. ఒకసారి సర్వే చేయిస్తే పోదా అనుకుని సర్వే చేయించింది. ఇంతకుముందు టెక్స్టు బుక్కులు సదువుదురు గదా! ఈ సర్వేలో తేలిందేమిటంటే పిల్లలు ఇప్పుడు అది కూడా మరిచిపోయిండ్రని. అంతేగాదు... వినడం, రాయడం, మాట్లాడటం గూడా రావడం లేదని.

అందరు నోరు తెరిచిండ్రు. 'ఎంతపనైపాయె. కొండెనాలికకు మందేత్తే ఉన్న నాలిక ఊడిపాయె' అనుకుని చేతులు పిసుక్కున్నరు. 'లక్షలపైస రాల్లపాలాయె' అని బాధపడ్డరు. పైగా ఈ సంగతి జనాలకు తెలవద్దాయె. తెలిస్తే బడికి పిల్లలను పంపరాయె... ఎట్లా...?

లోలోపల తొక్కుకున్నరు. 'ఇట్లెందుకయిందని'. సీక్రెట్‌గా సర్వేజేత్తే 'బడికి ఒక్క సారుంటే ఐదు క్లాసులకు ఎట్లజెప్పుతడు... ఇద్దరు ముగ్గురన్నా ఉండద్దా' అని సార్లు గరానికచ్చిండ్రు.

'అరే... నిజమేరా... కిటుకు ఇక్కడుందా...' అనుకుంది గవుర్నమెంటు. నాలికె కరుసుకుంది. ఆగమాగాన అందినకాడ అప్పు తెచ్చింది. వెయిల సంఖ్యలో నౌకర్లు పెట్టింది. సూది తూముల నుంచి ఈగిచ్చినట్టు వడవోసి వడవోసి కత్తులసొంటి పిల్లలకు నౌకర్లిచ్చింది.

సదువు చెప్పే పద్ధతిని కొంతమార్చింది. అపెప్‌ను జిల్లా కేంద్రంగా డిపెప్‌ను చేసింది. సెకరెట్రీలను తీసేసి రిసోర్సు పర్సన్‌లను పెట్టింది. ట్రెనింగ్‌ల మీద ట్రేనింగులు పెట్టింది.


అప్పుడు నేను మండల రిసోర్సు పర్సన్‌ను. బడిపిల్లలతో టెక్స్టులు

ఎట్లా సదివించాలె...? ఎట్లా నవ్వించాలె...? ఎట్లా ఆకర్షించాలె...? పలుక బలుపం పట్టకుంట ఓనమాలు ఎట్ల రాయించాలె...? ఇసుక లో... మన్నులో ఎట్ల దిద్దించాలె...?అన్నీ మండలంల సార్లకు ట్రేనింగ్ ఇచ్చిన. వారాలకు వారాలు క్యాంపులు పెట్టిన.

సార్లు మస్తు నేర్సుకున్నరు. 'అబ్బ ఎంత మంచిగుంది!' అన్నరు. 'ఈసారి సదువు మోత మోగాలె' అన్నరు. కొత్తసార్లు కొత్త మురిపెంతో రంకెలు గొట్టిండ్రు.

గవుర్నమెంటు ఓ కంట కనిపెడుతనే ఉంది. ముందటి లెక్కన ఐదేండ్లు ఆగితే కొంపలు మునిగి తెలుతయని రెండేండ్లకే సదువుమీద సర్వే చేసింది.

నమ్మి నానవోత్తే పుచ్చి బుర్రలయినయి. ఇప్పుడు సదువుడు కాదు. పిల్లలే బడికి రావడం లేదని తేలింది. బళ్లల్లో పిల్లలు సగానికి సగం తగ్గిండ్రు. కొందరు బర్లు గాయవోతున్నరు. కొందరు ఉప్పిడి ఉపాసమున్నా అడిగినంత ఫీజు కట్టి ప్రైవెట్లో సదువుతున్నరు. ఒక్కొక్క బడిలో నలుగురు సార్లుంటే ఇద్దరు పిల్లలున్నరు.



ఈసారి గవుర్నమెంటు ఇదేమిటని అడుగక ముందే సార్లంతా కోపంగా 'బడి బడికి సార్లనిచ్చిండ్రు సరే! సార్లకు కుర్చీలు వద్దా....? పొల్లగాండ్లకు బెంచీలు వద్దా....? క్లాసు కాసుకు రూములు వద్దా....? రూముకో బోర్డు వద్దా...? సదువంటే ఎన్నిగావాలె!' అన్నరు.

'అరే... అట్లనా.... బర్రెను తోలి వనుగడి మరిచినట్టాయె...' అనుకుంది గవుర్నమెంటు. వెంటనే 'ఆపరేషను బ్లాకుబోర్డు' (ఒబిబి) స్కీమును పెట్టింది. భూమి పుట్టిన జాగలనుంచి అప్పుతెచ్చింది: బడికి రెండు రూములు... రూముకు రెండు కిటికీలు... బాత్‌రూములు... లాట్రిన్ రూములు... కుర్చీలు బెంచీలు... సార్లకు జేబు ఖర్సులు...



**నిద్ర**

**రామారావు:** మీ ఆఫీసరు చాలా స్ట్రిక్ట్‌లా వుందే. మిమ్మల్ని చూస్తుంటే మీకు నిద్రపోవడానికి వీలుగా వున్నట్లు లేదు కదా!

**అప్పారావు:** మీకెలా తెలుసు.

**రామారావు:** ఆ విషయం మీరెలా కనిపెట్టారు?

**రామారావు:** మీరు ఆఫీసుకు అంత నీరసంగా వెళుతుంటేను.



అడిగినయి... అడుగనియి... అన్నీ ఇచ్చింది.

ఇస్తూ ఇస్తూ 'ఈసారి గనుక సదువు రాలేదనుకో... తోలుదీత్త' అన్నది గవుర్నమెంటు.

“తీత్తే తీత్తివిగని... కడుపు నిండుతలేదు” సార్లు అన్నరు.

'సరే' అంది గవుర్నమెంటు. డి.ఏ.లు పెంచింది.ఐ.ఆర్.లు ఇచ్చింది. పే కమీషన్ పెట్టింది. 'సార్లు కార్లల్ల తిరుగాలెసూదు' అన్నది. ఈతాకు జీతం పెంచి తాటాకు దరలను పెంచింది.

అప్పుడు నేను జిల్లా రిసోర్స్ పర్సన్‌ను. సార్లను ఒక ఉరుకుడు ఉరికిచ్చిన. దుమ్ము దులిపి గద్దిల గలిపిన. ఎటుజూసినా మీటింగులే!

ఈసారి పిల్లలకు సదువు నేర్పుడు ఒక్కటేగాదు. బడికి దూరమైన పిల్లలను బడికి ఎట్ల రప్పించాలె అనేదాని మీద గూడా ట్రెనింగులు జరిగినయి. స్టేటు రిసోర్సు పర్సన్‌లు జిల్లావాళ్లకు, జిల్లావాళ్లు మండలం వాళ్లకు మండలం వాళ్లు సార్లకు ట్రేనింగు ఇయ్యాలె. ఆ నేర్చుకున్న ట్రెనింగును సార్లు బడిలో అమలుచెయ్యాలె.

రోజుకొక ర్యాలి, వారోనికొక మీటింగు, నెలకొక సర్వే.... మూడు పువ్వులు పూచి ఆరుకాయలు కాచింది.

కొత్త రూములు. కొత్త వసతులు. కొత్తసార్లు. కొత్త సాలరీలు. పిల్లలకు బియ్యం. కొత్తసార్లు పిల్లలను ఆకర్షించడానికి కొత్తట్రిక్కులు నేర్పిండ్రు దొమ్మరిగడ్డ లేసిండ్రు. గ్యారడి ఆటలు నేర్పిండ్రు. సదువు వాగులెక్క పారాలన్నరు.

తీరా ఒకరోజు సర్వే జేత్తే తెలిసిందేమిటంటే ఐదో తరగతి సదువుతున్న పిల్లలకు గూడా ఓనమాలు ఒక్కటిరెండ్లు రావడంలేదని.

అందరి నాన్లు సల్లవడ్డయి. ట్రేనింగులు బాగానే విన్నరు. సర్వేలు బాగానే చేసిండ్రు. కష్టపడి నేర్చుకున్నదంతా బాగానే అమలు చేసిండ్రు. ఎక్కడ ఏ లోపం లేకుండా జరిగింది. అయినా సదువు రాలేదు. దోని సప్పుడు అయిందిగనీ దొయ్యపారలేదు. ఎందుకు...?

గవుర్మెంటుకు కోపమచ్చింది. సార్లందరినీ సస్పెండ్ చెయ్యాలనుకుంది. కాని ప్రభుత్వాలనే మార్చినోళ్లు... 'మా ఊరికి రండీ' లాంటి ప్రజా ఉద్యమాలనే ఎదిరించినోళ్లు నిర్బందాల మధ్య నిలిచినోళ్లు కాబట్టి భయపడి ఒక అడుగు వెనక్కు వేసింది. నప్పిచ్చి ఎలుకను పిల్లి వట్టుకున్నట్టు కొన్ని బడులను మూసింది. కొందరు సార్లను తీసింది.

ఇప్పుడు గవుర్మెంటుకు కొత్త భయం మొదలయింది. బళ్లు నడీ ఊర్లె ఉన్నయి. బడికి ఒక కమిటీ ఉంది. కమిటీకి ఒక చైర్మెన్ ఉన్నడు. చైర్మెన్‌కు ఒక పార్టీ ఉంది. గవుర్నమెంటు ప్రతీ పిల్లగాని పేరుమీద నెలకు రెండు వందలు ఖర్చు పెడుతుంది. ఆ విషయంగానీ ప్రజలకు తెలిసిందా...? అని!

వెంటనే సర్వే చేయించింది. పనిలోపని సార్లమీద గూడా సర్వే చేయించింది. తేలిందేమిటంటే ఏ సంగతి ప్రజలకు తెలియదు అని. చివరికి తమ పిల్లలకు సదువు రావడం లేదన్న విషయం గూడా. సార్లమీద ప్రజలకు గొప్ప నమ్మకముంది. తమ పిల్లలను ఊహించని రీతిలో తీర్చిదిద్దుతారన్న ఆశ కూడా ఉంది.


గవుర్నమెంటుకు పెద్ద గండం తప్పినట్ట యింది. గుడ్డిలో మెల్ల అనుకుంది. ఏ సంగతైనా ఎంత రహస్యంగా ఉంచినా ఎక్కడో లీకయితుంది. నడీ ఊర్లో బడి ఉన్నా ఈ సంగతిని బయటకు పొక్కకుండా ఉంచినందుకు సార్లను మెచ్చుకుంది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులిచ్చి గౌరవించింది.

గవుర్నమెంటుకు పట్టుదల పెరిగింది. 'పదో తరగతి ఫేలయినవాళ్లు ప్రైవేట్లో చెబితే సదువు వస్తదెట్ల? పెద్దసదువు సదివిన వీళ్ల గవుర్మెంటుల చెబితే రాదెట్ల...?' అనే ప్రశ్న కంటి మీద రెప్పను వాలనియ్యలేదు.

పిల్ల టకటక సదువుతుంది. చకచక లెక్కలు చేస్తుంది. బిరబిర రాస్తుంది. నాకు సంతోషంతో కండ్లల్ల నీళ్లు తిరిగినయి. సాక్షాత్తు సరస్వతిదేవినే చూసినట్టు అనిపించింది. ఈ సదువు నేర్పాలనే కదా ఇన్నేండ్లు మేము కొట్టుకున్నది... ఇట్ల తీర్చిదిద్దాలనే కదా ఇన్ని పథకాలను అమలు చేసింది. ఈ మార్పు కోసమే కదా ఇన్ని కోట్లు ఖర్చు పెడుతున్నది అనుకున్న.

నాలాంటి క్రియేటివ్ పర్సన్స్‌ను జిల్లాల నుంచి స్టేటుకు తెచ్చింది. గడియ తీరిక లేకుండా ట్రెనింగులకు మీటింగులకు తలలు బద్దలు కొట్టుకుని ప్లాన్‌లను తయారుజేస్తున్నం.

ఇప్పుడు అదే పనిలో తలమునకలై ఉన్న. ఇదీ నా సంగతి.



** ** **

ఇప్పుడు ఆ వార్త ఏమిటో చెప్పితే నేనే కాదు... మీరుగూడా పరేషానైతరు.

గవుర్నమెంటు సదువులు అటుకు ఎక్కినయని, వాటిని ఎట్ల దించాలో తెలియక మేము నెత్తికొట్టుకుంటున్నం గదా! ఈ సమయంలో తెలిసినవార్త ఏమిటంటే తీగల గుట్ట పల్లె బడిలో మూడో క్లాసు చదువుతున్న పిల్ల తప్పులు లేకుండా సదువుతూ రాస్తున్నదని, జమా, తీసివేత, గుణకారం, బాగారం తప్పులు పోకుండా చేస్తుందని.

ఈ వార్త అన్ని పేపర్లలో బాక్సు కట్టి వచ్చింది.

బస్సు బయలుదేరేముందు కరీంనగర్‌లో ఉండే దోస్తుకు ఫోన్ చేసిన. అతడు చెప్పిందేమిటంటే తీగల గుట్టపల్లె ఒక చిన్న తండానట. రిమోట్ ఏరియాలో ఉంటుందట. అక్కడ ఉండేసారు గురించి తెలిసిందేమిటంటే వట్టి సోమరిపోతట. మీటింగులకు సరిగ్గా వచ్చేవాడు కాదట. సర్వేలు, ర్యాలీలు చేసేవాడు కాదట. ఒకసారి వారం రోజులు ట్రేనింగు రానందుకు కేసు సీరియస్ అయిందట. పనిష్మెంటు కింద తీగలగుట్టపల్లెకు పంపింద్రట.

నాకు నమ్మబుద్ధి కాలేదు. నా మిత్రుడి యూనియన్ ఈ సారు యూనియన్ వేరువేరు కావచ్చుననుకున్న. అందుకే అబద్ధం చెప్పిండనుకున్న. ఇంకో ఇద్దరు ముగ్గురు మిత్రులకు ఫోన్ చేసినా అదేమాట.

అరే...అంతసోమరిపోతంటరు. సదువు ఎట్ల నేర్పిండు...? ట్రెనింగుల్లో తలలు పండినోళ్లు సాదించనిది ఇతను ఎట్ల సాధించిండు' అనుకున్న.

బస్సు వేగంగా పోతుంది. నా ఆలోచనలు అంతకంటె వేగంగా పోతున్నయి. అక్కడికి వెళ్తే తప్ప అసలు సంగతి తెలువదనుకున్న. నాలుగు బస్సులు దిగి, నాలుగు ఆటోలు ఎక్కి, కొంత దూరం నడిచి పొద్దుపొడిచే సరికి ఆ ఊర్లె దిగిన.

ముందుగా సదరు పిల్ల ఇల్లు తెలుసుకుని ఇంటికి పోయిన. ఇంటిముందు లైనుంది. చినిగిన గౌను రేగినజుట్టుతో కూర్చుంది పిల్ల. ముక్కుపొంట చీమిడికారుతంది. అది అప్పుడప్పుడు పొక్కలోని ఎలుక లెక్క బయటకు తొంగి చూసి గరుక్కున లోపలికి పోతుంది. కారట్లు చదివించుకునేటోళ్లు, రాయించుకునే టోళ్లు గుంపుగా ఉన్నరు.

పిల్ల టకటక సదువుతుంది. చకచక లెక్కలు చేస్తుంది. బిరబిర రాస్తుంది. నాకు సంతోషంతో కండ్లల్ల నీళ్లు తిరిగినయి. సాక్షాత్తు సరస్వతిదేవినే చూసినట్టు అనిపించింది. ఈ సదువు నేర్పాలనే కదా ఇన్నేండ్లు మేము కొట్టుకున్నది...ఇట్ల తీర్చిదిద్దాలనే కదా ఇన్ని పథకాలను అమలు చేసింది. ఈ మార్పు కోసమే కదా ఇన్ని కోట్లు ఖర్చు పెడుతున్నది అనుకున్న.

పక్క ఊరి నుంచి వచ్చానని అబద్ధం చెప్పి ఒకరోఖా రాయించుకున్న. రాత గుండ్రంగా చెక్కినట్టే ఉంది. ఒక్క తప్పు లేదు. రెండు మూడు మాటలు పొగిడి సదువు ఎట్ల నేర్చుకున్నవని ఆరాతీత్తే సందు ఇయ్యలేదు. 'చెబితే నేర్చుకుందామనే' అన్నట్టు చూసి నవ్వింది. ఆ సారునే తెలుసుకుందామని బడిదారిపట్టిన. నడుస్తుంటే తెలిసిందేమిటంటే ఇంకో పదిమంది వరకు ఇట్లనే తయారైతున్నరని.

మామూలుగా అది పిల్లలు బడికి పోయేయాల్ల. ఎక్కడ చూసినా బజార్లపొంట సంచులేసుకుని సైకిండ్లేసుకుని పిల్లలు కోళ్లు తిరిగినట్టు తిరుగుతుంటరు. విచిత్రంగా నాకు ఒక్క పిల్లగాడు కనిపించలేదు. ఆ రోజు సెలవా అంటే అది కూడా కాదు. 'ఎందుకబ్బా' అనుకుని బడికి చేరుకున్న.

నాకు కండ్లు దిరిగి పడ్డట్టయింది. బడి బడిలెక్కలేదు. బడిల పిల్లలు లేరు. ఊర్లె ఉండేగోజలు బడిలో ఉన్నయి. బడిలో ఉండే పిల్లలు ఊర్లె ఉన్నరు.

మేము నెత్తినోరు మొత్తుకుని చెప్పిన అందమైన తరగతి గది లేదు. పచ్చటిచెట్లు లెవ్వు. ఎస్.ఎస్.ఏ.పెన్సిల్ బొమ్మలేదు. గోడలమీద రాతలు లెవ్వు. విరిగిపోయిన బోర్డును చూస్తే తప్ప దానిని బడి అనలేం. బడిపక్కనే సారు ఇల్లు. పది దాటి నా బడి తెరువలేదు.

నేను బడి దగ్గర ఒక చెట్టుకింద కూసున్న. అప్పుడప్పుడు రోడ్డు వెంట పిల్లలు పోతంద్రు. ఒకడు బర్లతోని పోతండు. ఒకడు గడ్డికి పోతండు. ఒక పిల్ల సంటిపిల్లలను ఆడిత్తంది. ఒకలు మక్కలు ఎండకు బోసి కావలున్నరు. పెద్దలు పనుల మీద అడవికి పోతంద్రు.


పొద్దు నడీనెత్తిమీదికి వచ్చినంక అయ్యగారు బడికి వచ్చిండు. ఈ దొర సదువేం ఎలుగవెడుతడో సూద్దామని కొంతసేపు బయటనే ఉన్న. గంటయింది రెండు గంటలయింది. బెల్లు కొట్టింది లేదు. బడి సాగింది లేదు. ఎప్పుడో ఒకలిద్దరు పిల్లగాండ్లు వత్తంద్రు. గంటనో అరగంటనో ఉండి పోతంద్రు. సదరు మన కథానాయికనైతే గడ్డి మోపుతోనే వచ్చింది. మోపుకు నన్ను కావలివెట్టి బడిలోకి పోయింది. అరగంట తర్వాత ఇంటికి పోయింది.

(మిగతా 42 పేజీలో)

## వర్షం



సురేష్, హరీష్, మహేష్
ముగ్గురు ఆఫీసుకు బయల్దేరారు.
మధ్యలో వర్షం మొదలైంది.
అప్పుడు-
**సురేష్:** నా దగ్గర గొడుగు వుంది. నాకేం ఫర్వాలేదు. మీరిద్దరూ ఎలాగా?
**హరీష్:** నాకు కూడా ఫర్వాలేదు. నాది ఎలాగూ బట్టతలేకదా!
**మహేష్:** మీ ఇద్దరి కంటే కూడా నాకు ఇంకా ఎక్కువ ఫర్వాలేదు.
"ఎందుకని" అడిగారు సురేష్, హరీష్.
"నేను ఉదయం స్నానం చేయలేదు కదా!" అన్నాడు మహేష్.






రాములు

## ఆరోగ్యం పట్ల అవగాహన!

నేను వైద్యశాఖలో హెల్త్ సూపర్‌వైజర్‌గా నలభై సంవత్సరాలు సుదీర్ఘకాలం పనిచేసి ఇటీవలే రిటైర్ అయ్యాను. మా పిల్లలంతా వివాహాలు చేసుకుని ఉన్నంతలో స్థిరపడ్డారు. నా పరిధిలో తోటి ప్రజలకు చేతనైన సహాయ సహకారాలు అందిస్తున్నాను. ముఖ్యంగా చిన్న పిల్లలకు పల్స్ పోలియో కార్యక్రమాలు జరిగినప్పుడు నేను కూడా స్వచ్ఛందంగా అందులో పాల్గొని పలువురికి సహకరిస్తున్నాను. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేస్తున్నాను. వారిలో ఆ మేరకు విస్తృత అవగాహన పెంపొందించడానికి కృషి చేస్తున్నాను. ప్రతి రోజూ రాత్రి నిద్రించేముందు నా ఆరాధ్యదైవాన్ని తలచుకుంటాను. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటున్నాను.

**-బురుగు రాములు,**

*ఇం.నెం: ఎ-17, ఇ.డబ్లు.ఎస్., వనస్థలిపురం, హైదరాబాద్*



శాంతలక్ష్మి

## ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ!

నేను ఒక్క నిముషం కూడా సమయం వృథా చేయకుండా శ్రమిస్తుంటాను. నాకు తెలిసిన అల్లికలు, టైలరింగ్ విషయాలను ఆసక్తిగల వారికి ఉచితంగా చెబుతున్నాను. నా జీవితానుభవాలను కూడా ఈతరం యువతకు తెలియజేస్తుంటాను. అందరికీ తోడ్పటంలోనే ఆనందం ఉందని నేను నమ్ముతాను. కుట్టుపని నేర్చుకోవాలనుకునే ఆడవారిలో ఆ రంగం పట్ల చైతన్యాన్ని కలిగిస్తున్నాను. 'మానవసేవే మాధవ సేవ' అన్న నానుడిని నేను అక్షరాలా పాటిస్తాను. పెద్దలు ముఖ్యంగా నాలాంటి వృద్ధులు తమకు తెలిసిన అనుభవ సారాన్ని పిల్లలకు తెలియజేయాలని, తద్వారా వారు ఉత్తేజితులయ్యే అవకాశం ఎంతో ఉంటుందని తెలిసిన వాళ్లందరికీ చెబుతున్నాను.

*-శంకరమంచి శాంతలక్ష్మి, బాపట్ల, గుంటూరు జిల్లా*



కృష్ణమూర్తి

## వైద్యుడిగా ప్రజాసేవ!

నాకు ఇప్పుడు 75 సంవత్సరాలు. మొదట నేను ప్రభుత్వ గుమాస్తాగా పనిచేశాను. తర్వాత రాజకీయ రంగంలోకి ప్రవేశించడానికి గాను ఆ ఉద్యోగాన్ని వదులుకున్నాను. కొన్నాళ్ల డాక్టర్‌గా ప్రాక్టీసుచేసి ప్రజలకు వైద్యసేవలు అందించాను. జిల్లాలో గ్రామీణ వైద్యసోదరులకు నిపుణులైన డాక్టర్ల చేత ఇప్పించిన శిక్షణా కార్యక్రమాలకు నా వంతు కృషిచేశాను. డా॥ఎం. చెన్నారెడ్డి కాలంలో రాజకీయాలలో చురుకైన పాత్రను పోషించాను. ప్రజలకు బ్యాంకు రుణాల మంజూరులో నా వంతు సహకారం అందించాను. ప్రస్తుతం డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తూనే స్వాతంత్ర్య సమరయోధుల సేవలో ఉన్నాను.

**-డా॥ఎస్. కృష్ణమూర్తి,**

*ఇం.నెం:1-6-82, వి.టి.రోడ్, సూర్యాపేట, నల్గొండ జిల్లా*

# అనగనగా ఒక పేద బడి కథ

(22వ పేజీ తరువాయి)

లోపలికి పోయి చూస్తేగాని తెలువదని లోపలికి పోయిన. నిజానికి ఐదేండ్లు దాటకుండా ఆ బడికి రావద్దు. కానీ రెండేండ్లు మూడేండ్లున్న పిల్లలు గూడా వస్తంద్రు. ఇద్దరు ముగ్గురిని ముంద బేసుకుని అరగంట గంట కూసుంటుండు సారు. ఇదేం సదువంటే నోరు తెరువలేదు. నేను ఎవరినో చెప్పినతర్వాత నా మొఖమే సూడలేదు.

నా దోస్తులు చెప్పిందంతా నిజమే అనిపించింది. టైంలేదు. టైం టేబుల్ లేదు. సారు కూసున్నడంటే లేస్తలేడు. వచ్చెటోడు వస్తడు. పోయేటోడు పోతండు. బడిలో డ్రాపవుట్...ఎన్‌రోల్....

ఏ వివరాలు లేవు.

'అయ్యల్లా....బడిని ఇంత అద్వాన్నంగ నడుపుతండు.' అనుకున్న. రోజూ వందా, రెండు వందల కిలోమీటర్ల దూరం నుంచి బస్సులల్ల, ఆటోలల్ల, అలిసిపోయివచ్చె టీచర్లు గూడా టైంను పాటిస్తరు. ఈ దొరేంది బడిని నాశినం జేత్తండు అనుకున్న.

'ఇటువంటి వాళ్లు విద్యా విధానానికే చీడపురుగులు. వీళ్లను ఏరి వెయ్యక పోతే సమాజం బాగుపడది' అనుకున్న.

ఎం.ఇ.వో. ఎమ్మార్పీలమీద కోపం వచ్చింది. వీళ్లంతా ఏం జేస్తంద్రు చూస్తలేరా అనుకున్న. రిపోర్టును రాసుకుని సస్పెండ్ యాక్షన్ కోసం డి.ఇ.ఓ.ను కలిసిన.

అక్కడ డి.ఇ.వో. చెప్పింది విన్నంక నా కాళ్లకింద భూమి కదిలింది. సదరు ఆ ఉపాధ్యాయుడు ఆరు నెలల నుంచి లీవులో ఉన్నడట. డి.ఇ.ఓ. అతని ఫైలు ఒకటి నా చేతికిచ్చిండు.

అందులో ఒక ఉత్తరముంది.

నేను లీవులో ఉన్నాను కాబట్టి మీ టై టేంబుల్‌తో పనిలేదు. నా టైంటేబుల్ నాకుంది. అసలు దాని అమలుకోసమే లీవు పెడుతున్నాను. అరువై మంది పిల్లలకు ఏడాదిలో మీరు ఆశించిన లక్ష్యాలను సాధిస్తాను. చదువు నేర్పడమన్నది సాంఘీక అవసరమైతే అది నేర్చుకోవడమన్నది సామాజిక ఆర్థిక అంశం. అది ముందు గుర్తించాలి. పాలసీల అనుకరణ పెద్ద ప్రమాదం. ఒకచోట విజయం సాధించిన పాలసీ ఒకచోట చతికిలబడవచ్చు.

ఒకవేల నేను ఇందులో విజయం సాధిస్తే నా పాలసీ ఏంటని అడక్కండి. అది అందరిమీదా రుద్దకండి. ప్రైమరీ టీచరే పెద్ద పాలసీ. స్థానిక అవసరాల దృష్ట్యా పాలసీని తయారుచేయగల సమర్థుడు ఆయన. మీరు చేయాల్సిందల్లా స్వేచ్ఛను ఇచ్చి పనిని నిర్దేశించడం. ఫలితాలను సమీక్షించడం. ప్రైమరీ టీచరును ఏ చట్టాల మధ్య బిగించకుండా కొంతమందిని దత్తత ఇవ్వండి. ఫలితం చూడండి.

చదువు నేర్పడమన్నది మొగ్గ పువ్వుగా విచ్చుకున్నంత కళాత్మకంగా పువ్వు కాయగా మారినంత దీక్షగా జరగాలి. దానికి ఇన్ని కోట్లు ఇన్ని ఫీట్లు అవసరంలేదు. దానికి ప్రకృతిలో ఉన్న స్వేచ్ఛ కావాలి. కాతపూతలేని చెట్టును పెరికివేస్తాంచూడు. ఆ శిక్ష కూడా కావాలి.

అన్నింటికంటే ముఖ్యవిషయం.... అందరం ప్రజలకోసం పని చేస్తున్న వాళ్లమే! వాళ్లముందు ఏ విషయమూ దాచకూడదు. అంతకంటే నేరం ఇంకొకటి లేదు.

ఉత్తరం పూర్తయింది.

కింద పేరు... సంతకముంది.

డి.ఇ.వో వైపు చూసాను. ఏదో ఆలోచనల్లో ఉన్నాడు. ఆ ఉత్తరాన్ని ఎన్నోసార్లు చదివినట్టు అతని చూపులే చెబుతున్నాయి.

అంతవరకు పాలసీలను రుద్దడం తప్ప రూపొందించుకోవడానికి వ్యక్తిగతంగా స్వేచ్ఛ ఇవ్వని నాకూ అనిపించింది 'ప్రైమరీ టీచరు గొప్ప వనరు కదా! ఇలా ఎందుకు చేయగూడదు' అని.

అతడు కేంద్రంగా ఇప్పుడు నా అన్వేషణ మొదలయింది.